4న నేవీ డే వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ డా. మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డిసెంబర్ 4న నేవీ డే వేడుకలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలిసు కమిషనరు సిహెచ్.శ్రీకాంత్, నావికాదళ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 4న నిర్వహిచే నౌకా దళ దినోత్సవానికి ముఖ్య అతిధులు రానున్నందున ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నేవీ డే జరుగు ఆర్కే బీచ్ పట్టణంలోని ఇతర ముఖ్య ప్రాంతాలలో సుందరీకరణ పనులు వెంటనే చేపట్టాలని జీవీఎంసీ కమీషనర్‌కు సూచించారు. డయాస్ , సీటింగ్, పార్కింగ్, బారికేడింగ్, సౌండ్, ఎల్ ఈ డి స్క్రీన్స్ ఏర్పాటు తదితర ఏర్పాట్లపై చర్చించారు. నేవీ డే రోజున విద్యుత్ సమ స్యలు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఆంబులెన్స్, వైద్యాధికారులను ఏర్పాటు గావించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నేవీ అధికారులు దద్వాల్, కేప్టెన్ సాకేత్ కన్నా, వీఎస్‌సీ రావు, దివాకర్, జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్, డిప్యూటీ పోలీస్ కమిషనర్ సుమిత్ సునీల్ గరుడ్, డిఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను సమాచార కమిషనర్ సందర్శన

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో రాష్ట్ర సమాచార కమిషనర్ యు.హరి ప్రసాద్‌రెడ్డి పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. సమాచార చట్టం ద్వారా అందించే పత్రాలను రిజిస్టర్ పోస్ట్ మాత్రమే చేయాలని అన్నారు. ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో లవరాజు, డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, పరిపాలన అధికారి నాగేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సమాచార కమిషనర్

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ హరి ప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి నరసింహారాజు, పీఆర్‌ఓ నాయుడు స్వాగతం పలికారు. తొలుత ఆయన కప్పస్తంభం ఆలింగనం చేసుకుని, బేడా ప్రదక్షిణ చేసి స్వామివారికి తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈయనతోపాటు చిన్నగదిలి ఎమ్మార్వో పాల్ కిరణ్ తదితరులు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. దర్శనానంతరం ఆర్టీఐ కమిషనర్ మాట్లాడుతూ విశాఖలో ఆర్టీఐకి సంబంధించి అనేక అంశాలపై కేసులు వచ్చాయని అన్నారు. దీని వల్ల ప్రజల్లో ఆర్టీఐ పట్ల ప్రజల్లో చైతన్యాన్ని పెరుగుతుంది అన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని శాంతినగర్ గ్రామంలో వితంతువులకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ ఆధ్వర్యంలో బుధవారం వితంతు మహిళలకు ఉచితంగా చీరలుతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మహేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా...

విశాలాంధ్ర - కే.కోటపాడు: ఎంతో పని వత్తిడితో సత మతమవుతున్న ఉద్యోగులు ఒక రోజంతా ఉల్లాసంగా గడిపారు. హోదాలు పక్కన పెట్టి చిన్న, పెద్ద ఉద్యోగులందరూ కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేసి అందర్నీ అలరించారు. మండలంలోని ఎంపీడీవో, తహశీల్దార్ ఇతర మండల స్థాయి ఉద్యోగుల నుండి గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ బుధవారం చౌడువాడలో వన మహోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో కె.శచిదేవి, తహశీల్దార్ రమేష్ బాబు తదితరులు వేసిన థింసా నృత్యం అలరించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధలు పాల్గొన్నారు.

గెడ్డపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - యస్.రాయవరం: గెడ్డపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గ్రామంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా హౌసింగ్ సమస్యలు అధికంగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రమూర్తి, తహశీల్దార్ పి.శ్రీనువాసురావు, ఏఈలు దుర్గశంకర్, శ్రీనివాస్, వైసీపీ నాయకులు పొలిశెట్టి పెద ఈశ్వరరావు, దుబాసి సాయి, అద్దేపల్లి నూకినాయుడు, అల్లాడ నాగరాజు, సర్పంచులు మల్లే లోవరాజు, కొప్పిశెట్టి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శాఖా సమావేశం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం గ్రామ మండలిలో పశ్చిమ నియోజకవర్గం సీపీఐ శాఖ సమావేశం బుధవారం పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు పాలన వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే సహించేది లేదన్నారు. ఈనెల 25వ తేదీన నిర్వహించబోయే సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ , జె వి సత్యనారాయణ మూర్తి హాజరవుతారని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం శాఖ సీపీఐ నాయకులు రామకృష్ణ, గాంధీ గ్రామ్ శాఖ మధుసూదన్ రావు, సిపిఐ సీనియర్ నాయకులు బగ్గం సత్యానందరావు, షిప్ యార్డ్ నుండి హరి, స్థానిక నాయకులు నూనెల సూరిబాబు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అందుబాటులోకి టిడ్కో ఇళ్లు

విశాలాంధ్ర - పెందుర్తి: గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన టిడ్కో ఇళ్లు సుదీర్ఘకాలం నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు కొన్ని అందుబాటులోకి వచ్చాయి. జీవీఎంసీ జోన్-8 కార్యాలయం ఆవరణలో బుధవారం జెడ్పీ మల్లయ్య నాయుడు అధ్యక్షతన పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు లబ్ధిదారులకు ఇంటి పట్టాలు, తాళం చెవులు అందజేశారు. ఎమ్మెల్యే అదీప్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభించి సగంలో వదిలేసి వెళ్లిపోయిందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాటిని మరింత నాణ్యతగా పూర్తి చేసి అందించారన్నారు. స్థానికులు కొందరికి అప్పికొండ ప్రాంతంలో ఇల్లు కేటాయించారని వారికి కూడా ఈ ప్రాంతంలో ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైసీపీ నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవీ సాంబ, పీఏసీఎస్ చైర్మన్ గొర్లె రామునాయుడు, వార్డు పార్టీ అధ్యక్షులు ఎల్బీ నాయుడు, మెంట్ మహేష్, ఆదిరెడ్డి మురళి, దాసరి రాజు, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా డబ్బులు చెల్లించిన ఇల్లు మంజూరు కాలేదని ఆందోళన వెలిబుచ్చారు.

మహా చండీ హోమంలో ఎంవీఆర్

విశాలాంధ్ర - అనకాపల్లి: సర్వేజనా సుఖినోభవంతు ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని లోకకళ్యాణార్థం ప్రముఖ వ్యాపారవేత్త ఎంవీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వర రావు కుటుంబ సమేతంగా గాజువాక నియోజకవర్గం వడ్లపూడి గ్రామంలో ముత్యాల గార్మెంట్స్ కంపెనీ నందు కార్తీక మాసం బహుళ అమావాస్య పురస్కరించుకొని లక్ష్మీనారాయణ శివపార్వతులకు ప్రీతి అయిన రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ చతుర్వేద వేద పండితుల సారధ్యంలో విగ్నేశ్వర పూజతో మొదలుపెట్టి చండీ హోమం, మహా ఉపన్యాస పూర్వక రుద్రాభిషేకం, నవగ్రహ నక్షత్ర చండీ హోమం, చతుర్విధ పారాయణం, నవగ్రహాల మండపారాధన, జపాలు హోమాలు, వేదమంత్రాలతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వెంకటేశ్వరరావు సతీమణి సూర్య కుమారి, తనయులు రాజేష్ బాబు, సతీష్ బాబు, ఎంవీఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం కన్నులు పండుగ ఘనంగా జరిగింది. బుధవారం సాయంత్రం అనంత పద్మనాభ స్వామి కొండ క్రింది పావంచ దగ్గర నుంచి పై గుడి వరకు మొత్తం 1325 మెట్లుకు ఇరువైపులా ప్రమిదలతో దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు అన్ని ఏర్పాట్లు చేయడం వల్ల భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగలేదు. పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించడం వలన కొండకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బంది పడకుండా స్వామివారి దర్శనం చేసుకున్నారు. దీపోత్సవం అయి కొండపై ఉన్న అనంత పద్మనాభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు కొండ కింది ఉన్న కుంతి మాధవ స్వామి ఆలయానికి కూడా వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. గోస్తని స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. సినీనటుడు కిరణ్ అబ్బవరం స్వామి వారిని దర్శించుకుని సందడి చేశారు.

పీఎం పాలెం పీఎస్‌ను తనిఖీ చేసిన సమాచార కమిషనర్

విశాలాంధ్ర - పిఎం పాలెం: వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం-2005 అమలు తీరును పర్యవేక్షించేందుకు రాష్ట్ర సమాచార కమిషనర్ యు.హరి ప్రసాద్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. బుధవారం ఉదయం పోతినమల్లయ్యపాలెం పోలిస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. సిఐ వై.రామకృష్ణ, సిబ్బంది ఆర్టిఐ కమిషనర్‌కు సమాచార హక్కు దరఖాస్తుదారుల వివరాలను తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌లో సమాచార హక్కు స్వేచ్ఛగా అమలు చేయాలని కమిషనర్ ఈ సందర్భంగా పోలీసు అధికారులను ఆదేశించారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ కేంద్రంలో సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రం,హెల్త్ సెంటర్ భవనాలు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ జెడ్పీటీసీ దీసరి గంగరాజు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ప్రజలకు సేవలు అందించేందుకు భవనాలు లేక సచివాలయ సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించి భవనాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగువశోభ మాజీ సర్పంచ్ పాంగి మద్దు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్లమెంట్ మార్చ్‌కు ఏఐఎస్‌ఎఫ్ బృందం

విశాలాంధ్ర - విశాఖ: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న పార్లమెంట్ మార్చ్‌కు విశాఖ నుంచి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగరాజు, జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో గత 8 సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేయడానికి, విద్య కాషాయకరణ, విద్య ప్రైవేటీకరణ కుట్రలో భాగంగానే ఆగమేఘాల మీద నూతన జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ ఇ పి 2020) ని తీసుకువచ్చిందన్నారు. పాఠ్య పుస్తకాలలో స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలను అర్పించినవారి చరిత్రను ఎత్తివేసే ఆలోచన తగదన్నారు. దేశంలో భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ చట్టాన్ని అమలుచేసి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రమణ, బాబ్జి, బాలాజీ, అభి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలోని పెద్దగూడ పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని, అంగన్వాడి భవనాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అరబీరు సుభద్రలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని అన్నారు. అనారోగ్యాల బారిన పడినవారు ఇక్కడే వైద్య సేవలు పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో కిరణ్ కుమార్, వైద్యాధికారి రమేష్, సీడీపీఓ రాజేశ్వరి, సర్పంచ్ మండి బాబురావు, ఎంపీటీసీ టి.గణపతి, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరావు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు వి.రమేష్, వైసీపీ నాయకులు జగబంధు, జెవివి ఎన్ మూర్తి, జి.సన్యాసిరావు, కె.పిత్ బాస్, పులి రాజు, దాసు వెంకట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

26న గొన్న కళాశాలలో జాబ్ మేళా

కళాశాల సెక్రటరీ హేమ్‌చంద్‌నాయుడు

విశాలాంధ్ర -పరవాడ: జీవీఎంసీ 85వ వార్డులో గల గొన్న కళాశాల (గొన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సైన్సెస్)లో ఈ నెల 26వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ గొన్న హేమ్‌చంద్‌నాయుడు తెలిపారు. ఈ మేళాలో వైస్ ఫిన్ సర్వీసెస్, ఎన్ఐఐటి-ఐసిఐసిఐ బ్యాంక్, జయభేరి ఆటో మొబైల్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. వైస్ ఫిన్ సర్వీసెస్ కంపెనీలో వెల్త్ మేనేజర్ ఉద్యోగాలకు గాను ఎంపికలు ఉంటాయన్నారు. డిగ్రీ, ఎంబీఏ అర్హత కాగా జీతము 1.8 లక్షల నుంచి 2.3 లక్షల వరకు ఉంటుందని, విశాఖపట్నం లోనే జాబ్ చేయవలసి ఉంటుందన్నారు. ఎన్ఐఐటి-ఐసిఐసిఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు గాను ఎంపికలు ఉంటాయన్నారు. జీతం 2.45 నుంచి 3.1లక్షల వరకు ఉంటాయని, ఏపీలోనే జాబ్ చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. జయభేరి ఆటోమొబైల్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఎడిటర్స్, సర్వీస్ అడ్వైజర్స్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికలుంటాయన్నారు. బీకాం విత్ టాలీ, ఇంటర్, ఎనీ డిగ్రీ, డిప్లమా మెకానికల్/ ఆటోమొబైల్, ఐటిఐ మోటార్/డీజిల్ మెకానికల్ కాగా జీతం రూ.12వేల నుంచి 15వేల వరకు ఉంటుందన్నారు. జాబ్ లోకేషన్ విశాఖపట్నం అని పేర్కొన్నారు. తమ సర్టిఫికేట్స్‌తో పాటు 3సెట్లు జెరాక్స్‌లు తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు మనోజ్-9642829352, కళ్యాణ్-7995344658, జాన్-9885784543 నెంబర్లకు సంప్రదించవచ్చున్నారు.

సాంకేతిక విద్యలో నైపుణ్యాల కొరతను అధిగమించాలి

విశాలాంధ్ర - మధురవాడ: పారిశ్రామిక రంగంలో ఆటోమేషన్ పెరుగుతున్నప్పటికి 21 లక్షలకు పైగా ఉద్యోగాలు ఉన్నాయని ఐతే యువతరం తగిన నైపుణ్యాలను సాధించినప్పుడే అవకాశాలు చేజిక్కించుకోగలరని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రారంభమైన స్తుతి కార్యక్రమంలో నిపుణులు సూచించారు. "అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ మెథడ్స్ ఫర్ ఆటోమొబైల్ అప్లికేషన్స్" శిక్షణను ఎయు సెంటర్ ఫర్ నానో టెక్నాలజీ డైరక్టర్ డాక్టర్ రాంజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా నైపుణ్యాలను పెంచుకోవాలని అందుకు "స్తుతి" వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, గీతం మెకానికల్ ఇంజనీరింగ్ అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ బళ్ళ శ్రీనివాసప్రసాద్, శిక్షణ కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.శివప్రసాద్, డాక్టర్ వి.ఎస్.ఎన్. వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ సి.హెచ్.శోభ పాల్గొన్నారు.

ఉప్పహార్ స్వచ్ఛంధ సంస్థకు స్థలం కేటాయింపు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: యలమంచిలి ఎమ్ఎల్ఏ యు.వి. రమణమూర్తి రాజు ఆదేశాల మేరకు ఉప్పహార్ స్వచ్ఛంధ సంస్థకు స్థలం కేటాయించినట్లు సర్పంచ్ గండిబోయిన భాను వెంకట్ తెలిపారు. ఉప్పహార్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో రెండు మంచినీటి బోర్లు నిర్మించారన్నారు. అలాగే ఎలిమెంటరీ విద్యార్థులు సుమారు 90 మందికి పాఠశాల విద్య అనంతరం ట్యూషన్ చెప్పిస్తూ వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ బెన్యమిన్, సూపర్‌వైజర్ బిడ్డిక గౌరీ శంఖర్, రాజా ఫినిహాస్ పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే యూ.వి. రమణ మూర్తి రాజు(కన్నబాబు) పాల్గొన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ప్రతి గడపకు వెళ్లి పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్ర మంలో మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార్ వర్మ, మున్సిపల్ చైర్మన్ పి.రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, వైస్ చైర్మన్‌లు నాగేశ్వరరావు, గుప్తా, ఎంపీపీ గోవింద్, పట్టణ వైసీపీ అధ్యక్షులు ఎర్రయ్యదొర, కౌన్సిలర్లు చిన్న మ్మలు, సత్తిబాబు, వెంకట్, అచ్యుతరావు, మున్సిపల్ ఆర్వో నీలిమ, టీపీఓ శ్రీలక్ష్మి, వైసీపీ నాయకులు సేనాపతి రాము, కుమార్, శివ, డాక్టర్ త్రినాథ్, కొండబాబు, రమణ పాల్గొన్నారు.

పథకాలు అందించడంలో నిర్లక్ష్యం వద్దు

విశాలాంధ్ర - హుకుం పేట: మారుమూల గ్రామల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షే మ పథకాలు సక్రమంగా అందేలా సచివాలయ సిబ్బం ది, వలంటీర్లు పని చేయాలని జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం అన్నారు. బుధవారం మండలంలోని పాతకోట పంచాయతీ కేంద్రాలతో పాటు మత్రిపాలెం, పనసపుట్టుపాలెం గ్రామాలలో ఆయన సందర్శిం చారు. పాతకోటలోని సచివాలయంలో సందర్శించి రికార్డులను పరిశీలించారు. సచివాలయ కేంద్రాంలో సిబ్బంది, పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అన్నారు. అనంతరం పాఠశాలలో నాడు - నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాటి లక్ష్మి, వైసీపీ నాయకులు చిన్నయ్య, రాంబాబు, డిజిటల్ అసిస్టెంట్ బాలన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరావు, ఏనిమల్ హస్బండ్రీ అసిస్టెంట్ సింహాచలం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - నాతవరం: రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలో ఇప్పటికే వరి కోతలు కొన్ని చోట్ల పూర్తయ్యాయని, నూర్చిన ధాన్యాన్ని నిల్వ చేసే అవకాశం లేనందున వెంటనే కొనుగోలు చేయాలని వారు కోరారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, అనకాపల్లి జిల్లాలో కూడా ఏర్పాటు చేయాలన్నారు.

కాంతిలాల్ దండే ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి, ప్రజా సంఘాలు, మీడియా ప్రవేశం నిషేధమని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని అరకు టీఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వనుగు త్రినాథ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే విద్యార్థి, ప్రజా సంఘాలకు పాఠశాలల్లో అనుమతి లేదనడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.ఎస్.ఎఫ్ పాడేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొండపల్లి నితిన్ కుమార్, బాబురావు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో సీఎంకు స్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుండి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవివి సత్యనారాయణ, బి.వి.సత్యవతి, జి.మాధవి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డా . ఎ.మల్లికార్జున, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్, డిప్యూటీ పోలీస్ కమీషనర్ సుమిత్ సునీల్ గరుడ్,ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తదితరులు స్వాగతం పలికారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని 2021 -22 పదవ తరగతి మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను బుధవారం సాగర్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో బయ్యవరం ఆవరణలో అందజేశారు. మొదటి ర్యాంకుకు 20 వేలు, రెండువ ర్యాంకు 15 వేలు, మూడవ ర్యాంకు 10 వేలు అంద జేశారు. మండలంలోని 13 జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. తహశీల్దార్ బి.సుధాకర్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.చిట్టిబాబు, సాగర్ సిమెంట్ కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ కే.శ్రీనివాస్, సీనియర్ హెచ్ఆర్ జి.పాండు రంగారావు, జనరల్ మేనేజర్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

వేగవంతంగా రహదారి కల్వర్టు, నిర్మాణాలు

విశాలాంధ్ర - సీలేరు: జికేవీధి మండలం సీలేరు, దుప్పులవాడ పంచాయతీ పరిధి చల్లనిశిల్ప మధ్య గల ప్రధాన రహదారిలో కల్వర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాలగెడ్డ - ఆర్వీనగర్ మధ్య గల బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారి టెండర్లు ప్రక్రియ గతంలోని పూర్తయినప్పటికీ వర్షాభావ పరిస్థితులు, కొన్ని సాంకేతికపరమైన ఇబ్బందులతో రహదారి, కల్వర్టు పనులు నిలిచిపోయాయి. గతంలో పలువురు ప్రజా ప్రతినిధులు ఐటీడీఏ పీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత కాంట్రాక్టర్‌తో రహదారి పనులు చేపట్టే విధంగా ఆర్అండ్‌బి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బిటి రోడ్డు, కల్వర్టు పనులు పూర్తయితే రవాణా సౌకర్యంతో పాటు వాహన చోదకుల కష్టాలు తీరనున్నాయి.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కోటవురట్ల: మండలంలో జరుగు తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు జెడ్పీ సీఈఓ శ్రీరామూర్తి ఆదేశించారు. ఆయన మండలంలో తంగేడు గ్రామంలో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని, పాములవాక ఎస్సీ కాలనీలో వేసిన సిసి రోడ్లను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 26 లక్షలు జడ్పీ నిధులు విడుదలైనం దున వాటికి సంబంధించిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, జడ్పిటిసి ఉమాదేవి, పంచాయతీరాజ్ జేఈ వర్మ పాల్గొన్నారు.

స్ఫూర్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కొయ్యూరు: పోలీస్ శాఖ, ఐటీడీఏల సమన్వయంతో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మంప ఎస్సై లోకేష్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని బూదరాళ్ళ పంచాయతీ గరిమండ వారపు సంతలో గరిమండ అన్నవరం, గొర్లమెట్ట, కన్నవరం తదితర చుట్టుపక్కల గ్రామస్తులు గిరిజన యువతతో ఎస్సై లోకేష్ కుమార్ సమావేశమయ్యారు. ఎస్ఎస్సి జిడి కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ వరకు గడువు ఉన్నందున 10వ తరగతి పాసైన 18 నుంచి 28 సంవత్సరాలు మధ్య వయసు గల ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు స్థానిక స్టేషన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి



విశాలాంధ్ర - రావికమతం: అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని రావికమతం ఐసీడీఎస్ సీడీపీవో ఉషారాణి సూచించారు. కొత్తకోట లోని నాల్గవ అంగన్వాడీ కేంద్రాన్ని బుధ వారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భం గా అంగన్వాడీ కేంద్రంలోని స్టాకులను పరిశీలించి, రిజిష్టర్లను తనిఖీ చేశారు. కోడి గుడ్లు, పాలు, బాలామృతం, వైఎస్ఆర్ కిట్లు, బియ్యం, నిత్యావసర సరకుల సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు.. మధ్యాహ్న భోజనం రుచిని చూశారు. ఈ కార్యయక్రమంలో కొత్తకోట సెక్టారు సూపర్వైజర్ విజయ, అంగన్వాడీ కార్యకర్త జానకి తదితరులు పాల్గొన్నారు.

సత్య శోధనకు సేవలే సోపానాలు

విశాలాంధ్ర - గాజువాక: భక్తి మార్గంలో సత్య శోధనకు సామాజిక సేవలే సోపానాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బుధవారం వెంపల్ నగర్‌లో శ్రీ సత్య సాయి జయంతి ఉత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సేవా సమితి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా భక్తులకు నిత్యావసర సరుకులు అందజేశారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

-రాష్ట్ర సమాచార కమిషనర్ ఉల్చల హరి ప్రసాద రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం 2005ను ఖచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్ ఉల్చల హరి ప్రసాద రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం సింహాచలం శ్రీ వరహా నరసింహ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం-2005 అమలు తీరును పర్యవేక్షించేందుకు ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా కమర్షియల్

ట్యాక్స్ డిపార్ట్మెంట్ జా యింట్ కమిషనర్ కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం పోతినమల్లయ్య పాలెం పోలిస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. తదుపరి ఆనందపురం మండల రెవెన్యూ అధికారి కార్యాలయాన్ని, భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వాటిని సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం భీమిలి జివియంసి జోనల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం విఎమ్ఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని, జీవియంసి ప్రధాన కార్యాలయాన్ని, జిల్లా పరిషత్ కార్యాలయాన్ని, మహారాణిపేట మండల రెవెన్యూ అధికారి కార్యాలయంతో పాటు జివియంసి జోన్-4 కార్యాలయాల్లో ఆర్టీఐ రికార్డులను పరిశీలించారు.

ఎన్టీపీసీ వద్ద బాధిత కుటుంబం ఆందోళన

విశాలాంధ్ర - పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో గత ఐదు రోజుల క్రితం గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డి.రాంబాబు అనే మెయింటెనెన్స్ కార్మికుడిని యాజమాన్యం పట్టించుకోలేదని బుధవారం ఉదయం సంస్థ మెయిన్‌గేటు వద్ద బాధిత కుటుంబం గ్రామస్తులతో కలిసి ఆందోళనకు దిగింది. కార్మికులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆందోళనకు సీఐటీయూ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఎన్టీపీసీ (సీటు) కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ చికిత్స కాలంలో వేతనం చెల్లించి స్కిల్డ్ వర్కర్‌గా మార్పు చేయాలన్నారు. నష్టపరిహారం చెల్లించి మెరుగైన వైద్యం అందిచాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులతో జరిగిన చర్చలలో వేతనంతో కూడిన సెలవులు, జనరల్ షిఫ్ట్ డ్యూటీ ఇవ్వడానికి, మెరుగైన వైద్యం అందించడానికి యాజమాన్యం అంగీకరించింది. అలాగే కాంట్రాక్టర్‌తో మాట్లాడి నష్టపరిహారం సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్

అధ్యక్షుడు పైల పోతునాయుడు, లీడర్ రమణ, ఎం.సత్యనారాయణ, వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వీఎమ్మార్డీఏ సీఈగా శివప్రసాద రాజు

విశాలాంధ్ర - విశాఖ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్ మెంట్ అథారిటీ (వీఎమ్మార్డీఏ) చీఫ్ ఇంజనీర్‌గా నియమితులైన పి.శివప్రసాద రాజు గురువారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. పబ్లిక్ హెల్త్ విభాగానికి చెందిన ఆయన ఏపీ సి ఆర్ డి ఏ లో సీఈగా పనిచేస్తున్నారు. ఏడాది కాలానికి డిప్యూటేషన్ పై ఆయన్ని వి ఎం ఆర్ డి ఏ సీఈగా నియమించారు. ఆయన గతంలో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధ హోదాల్లో పనిచేశారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కె.శచిదేవి తెలిపారు. చౌడువాడలో రెండు, ఆనందపురంలో ఒకటి వలంటరీ పోస్టులుకు ఖాళీలు వున్నట్లు, 24, 25 తేదీల్లో అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చెరువు కోసం స్థల పరిశీలన

విశాలాంధ్ర - జీకేవీధి: జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ ఆసరాడ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, అమృత్ సరోవర్ పథకం కింద చెక్ డ్యామ్ ఏర్పాటు చేయటం కోసం మండల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఎం చల్లంగి రాంప్రసాద్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మధుసూదన్‌రావు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బబ్బిలి లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు బబ్బిలి లక్ష్మణ్, పీఏసీఎస్ చైర్మన్ వసుపరి ప్రసాద్, పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ, వైసీపీ నాయకులు అంజి, బొబ్బిలి వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

విశాలాంధ్ర - పీఎం పాలెం: భవన నిర్మాణ కార్మికురాలుగా పని చేస్తున్న మరికవలస రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన అప్పన్నమ్మ (40) పీఎం పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్ మెంట్‌లో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన స్థానికంగా తీవ్ర ప్రసాదం నెలకొంది. ఈమెకు ఇద్దరు పిల్లలు పి.కీర్తి (19), పి.గోవింద్ (16) వున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజమే దేవాలయం

విశాలాంధ్ర - గాజువాక: సమాజమే దేవాలయం అని బిజెపి సీనియర్ నాయకులు వెన్నా శ్రీరామమూర్తి అన్నారు. శ్రీ సత్యసాయి సేవాసమితి ద్వారా సాయి భక్తులు చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయమైనవని కొనియాడారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 97వ జన్మదిన వేడుకలు ఉక్కునగరం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఎ ై బ. ˇ వ ం ∩ ¯ నిర్వహించారు. గౌరవ అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి కన్వీనరు రామకృష్ణ, ఉక్కు అధికారి దీపాంకర్ దాస్, సలాది విష్ణుమూర్తి, కెఆర్కే రాజు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో ఖాజీపాలెం విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ఒంగోలు ట్రిపుల్ ఐటిలో ఖాజీపాలెం విద్యార్థిని అప్పి కొండ అశ్విని ఎంపికయినట్లు ప్రధానా పాధ్యా యురాలు కె.రామలక్ష్మి తెలిపారు. రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ ఐ.ఐ.ఐ.టి విడుదల చేసిన 4వ విడతలో అశ్విని ఎంప˘కయ్యారన్నారు. గడిచిన విద్యా సంవత్సరం 2021-22లో ఎస్.ఎస్.సి పరీక్షల్లో అశ్విని 557 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. అశ్వినికి ట్రిపుల్ ఐటీలో ఎంపికవ్వడం పట్ల గ్రామ సర్పంచ్ పీలా నర్సింగరావు, పాఠ˘శాల విద్యా కమిటీ చైర్మెన్ అప్పికొండ ప్రసాద్, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు. అదే విధంగా రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

స్మార్ట్ ఫోన్లో డిజిటల్ లైబ్రరి సేవలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: నేషనల్ డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జూలై 12 నుంచి డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిందన్నారు. ఇందులో స్మార్ట్‌ఫోన్ ఉన్న వాళ్లంతా రిజిస్టర్ అయితే ఎన్నో పుస్తకాలు లభిస్తాయన్నారు. గ్రంథాలయానికి రాకుండానే ఫోన్‌లో పుస్తకాలు చదువుకోవచ్చని సూచించారు.

దివ్యాంగ పింఛన్లపై సర్వే

విశాలాంధ్ర - రావికమతం: మండలంలోని దివ్యాంగ పింఛన్ అర్హతలపై అధికారుల బృందం గ్రామాల వారిగా ధృవపత్రాలు, అంగవైకల్యంపై పరిశీలన చేస్తున్నారు. 28 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 3వేల వరకు దివ్యాంగ పింఛన్‌దారులు ఉన్నారు. కొందరు తప్పుడు ధృవపత్రాలు సృష్టించి, వైకల్యం లేకున్నప్పటికీ నెల నెలారూ.3వేలు, ఆపైబడి మొత్తంలో దివ్యాంగ పింఛను పొందుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లతో కూడిన అధికారుల బృందంగా గ్రామాల వారిగా సర్వే చేస్తున్నారు. అంగవైకల్య శాతం, సదరం సర్టిఫికేట్ ప్రకారం శాతానికి సరిపడా అంగవైకల్యం ఉందా లేదా, అంగవైల్యం పుట్టుకతోనా, అనారోగ్యమా, ప్రమాదం వలన వచ్చిందా, పింఛన్ పొందుతున్న దివ్యాంగుడు ఏం పని పనిచేస్తున్నాడు అనే దానిపై సర్వే చేశారు. ఈవోపీఆర్డీ రమణయ్య బుధవారం దొండపూడిలో ధృవపత్రాల పరిశీలన చేశారు. ఈ గ్రామంలో 84 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉండగా 53 మంది ధృవపత్రాల పరిశీలనకు హాజరయ్యారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మోదమాంబ కాలనీలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సత్య సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా తెల్లవారు జామున గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. జయంతి సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శ్రీ మోదమాంబ ఆలయ ప్రముఖ సిద్ధాంతి భమిడిపాటి సుబ్రమణ్య శాస్త్రి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. బాబా వారిని డిప్యూటీ సిఎం, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి బూడి ముత్యాల నాయుడు కుమార్తె ఈర్లె అనురాధ దర్శించుకున్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, గ్రామ పంచా యితీ సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనువాసరావులు దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, వార్డు మెంబర్లు జవ్వాది వరహాలు, శీలమంతుల జ్యోతి వాసు, భగవాన్ శ్రీ సత్య సాయి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాలారి వీధిలో గడపగడపకూ మన ప్రభుత్వం

విశాలాంధ్ర - మల్కాపురం: ఎన్నికల మేనిఫెస్టోనే పవిత్ర మత గ్రంధాలుగా భావించి అమలు చేస్తున్న ప్రభుత్వమే జగనన్న ప్రభుత్వం అని విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రెండో రోజు గడపగడపకు మన కార్యక్రమంలో భాగంగా 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జాలారి వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 400 గడపలను సందర్శించారు. ఎన్నికలలో చెప్పిన విధంగా మేనిఫెస్టోయే పవిత్ర మత గ్రంథాలుగా భావించి పేద ప్రజల సంక్షేమ అభివృద్ధి ఫలాలను ఎటువంటి కుల, మత, వర్గ వైసమ్యాలు లేకుండా అర్హత ప్రామాణికంగా తీసుకొని ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలను ఎటువంటి అవినీతి లేకుండా అందజేయడమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, 40వ వార్డ్ కార్పొరేటర్ నాగేశ్వరరావు, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధా, ఇంచార్జ్ దాడి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ విల్లా కన్నబాబు, పీలా మాధవి, బిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ-2గా ఆనంద రెడ్డికి అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 1996లో పోలీసు శాఖలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా చేరి ఏడీసీపీ స్థాయికి వచ్చి, ఇటీవల ఐపీఎస్ కూడా దక్కిన కె.ఆనంద్ రెడ్డి విశాఖ సిటీ ఎస్బీ ఏడీసీపీగా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఆనందరెడ్డికి డీసీపీ-2బాధ్యతలు సీపీ అప్పగించినట్లు తెలిసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక చోట్ల ఇన్‌స్పెక్టర్ వంటి కీలక పోస్టుల్లో పనిచేశారు.

25న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో ఈనెల 25 శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నామని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యలయం వద్ద పంచాయతీలకు చెందిన సమస్యలపై అన్ని రికార్డులతో పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని తెలిపారు.

జిల్లా గ్రామీణ వైద్యుల ప్రధాన కార్యదర్శిగా కడగల

విశాలాంధ్ర - ఆనందపురం: జిల్లా సామాజిక గ్రామీణ వైద్యుల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కడగల. నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సామాజిక గ్రామీణ వైద్యుల వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, లీగల్ అడ్వైజర్ కెపి దేశయ్య, ఆంధ్రప్రదేశ్ కలాం ట్రస్ట్ చైర్మన్ మమ్ముల తిరుపతిరావు, సీనియర్ అడ్వైజర్ లాడ త్రినాధరావు, వ్యవస్థాపక వ్యవస్థాపక కార్యదర్శి పి.కనకా రావు, వ్యవస్థాపక ట్రెజరర్ పి.రామ్ కోటేశ్వరరావు, మహిళ అధ్యక్షురాలు సుగుణ, మహిళా సెక్రటరీ రోజా, మాజీ జోనల్ సెక్రటరీ గోపి, విజయనగరం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 'గోల్డ్‌లోన్ మేళా' బంపర్ ఆఫర్లు

విశాలాంధ్ర/విశాఖపట్నం: భారతదేశంలోని అతిపెద్ద నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలలో ఒకటైన ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ నవంబర్ 15, 2022 నుండి డిసెంబర్ 31, 2022 వరకు కస్టమర్లందరికీ 'గోల్డ్ లోన్ మేళా బంపర్ ధమాకా'తో గోల్డ్‌లోన్‌పై అద్భుతమైన ఆఫర్లను ప్రారంభించినట్లు తెలిపింది. భారతదేశంలోని ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు చెందిన 2400పైగా బ్రాంచ్‌ల నుండి గోల్డ్‌లోన్ తీసుకునే ప్రతి కస్టమర్‌కు లగ్జరీ కారు, బైక్‌లు, స్మార్ట్‌ఫోన్ వంటి బహుమతులు అందు తాయి. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ బిజినెస్ హెడ్ సౌరభ్ కుమార్ మాట్లాడుతూ, ఈ ధమాకా ప్రారంభోత్సవం సందర్భంగా ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్ చాలా ఎక్కువ కస్టమర్ లాయల్టీతో దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన గోల్డ్‌లోన్ బ్రాండ్లలో ఒకటిగా వుంది. దానికి కృతజ్ఞతగానే తాము ఈ గోల్డ్‌లోన్ ధమాకా ఆఫర్లను ప్రారంభించినట్లు చెప్పారు.

రవాణా, హమాలీల చార్జీలు చెల్లించాలి

విశాలాంధ్ర - నాతవరం: మండలంలో 2020-2021 సంవత్స రానికి సంబంధించి హమాలీల, ధాన్యం రవాణా చార్జీలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. 2021 డిసెంబరులో ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా గునుపూడి, పికేగూడెం రైతులు పికేగూడెం సొసైటీకి తీసుకెళ్లామని, 50కిలోల బస్తాకు 10 రూపాయలు రవాణా హమాలీల చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని సివిల్ సప్లై అధికారుల దృష్టికి తీసుకువెళితే మిల్లర్ల అకౌంట్‌లో పడ్డాయని చెబుతున్నారని వారు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో రైతులకు చెల్లించారని, మండలంలో చెల్లించలేదని వారంటున్నారు. హమాలీల, రవాణా చార్జీలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పెందుర్తి: సబ్బవరం పీహెచ్‌సీలో వైద్యం కోసం బుధవారం ఉదయం చేరిన వ్యక్తి కోమాలోకి వెళ్లి సాయంత్రానికి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వైద్యాధికారి డాక్టర్ ఎస్ ఎన్ ఆర్ చక్రవర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 38 ఏళ్ల వయసు గల వ్యక్తి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారని, తన పేరు కె చిన్న అని తాను చోడవరానికి చెందిన వాడినని చెప్పినట్లు తెలిపారు. తలపై కొబ్బరి బొండం పడినట్లు చెప్పాడన్నారు. తాము వెంటనే ప్రధమ చికిత్స చేస్తూ ఉండగా కోమాలోకి జారిపోయాడన్నారు. ఇతనికి సంబంధించి బంధువులుగాని స్నేహితులు గాని లేకపోవడంతో చేసేది లేక కె జి హెచ్ కు తరలించేందుకు 108కు సమాచారం అందించగా వాహనం వచ్చేలోగా ఆ వ్యక్తి మృతి చెందాడన్నారు. ఈ విషయాన్ని డి ఎమ్ అండ్ హెచ్ ఓ కి స్థానిక పోలీసులకు సమాచారం అందించడం జరిగిందని డాక్టర్ తెలిపారు.

ఆర్కే బీచ్‌లో ఒడ్డుకు చేరిన విద్యార్థి మృతదేహం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ ఎదురుగా బీచ్ ఒడ్డుకు కొట్టుకు వచ్చిన గవర్నమెంట్ పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి లోకేష్, మూడవ పట్టణ పోలీసులు బంధువులకు సమాచారం అందించినట్లు తెలిసింది. బుధవారం ఉదయం సముద్ర స్నానాల్లో భాగంగా విద్యార్థి గల్లంతయినట్లు సహచర విద్యార్థులు తెలియజేశారు.

టిడ్కో ఇళ్లకు అర్హులు కాని లబ్దిదారులకు "డిడి"లు తిరిగి చెల్లింపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: "టిడ్కో" ఇళ్ళకు దరఖాస్తు చేసుకోగా అర్హత పొందని లబ్దిదారులకు వారు చెల్లించిన సొమ్మును నగర్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చేతుల మీదగా డి.డి. లు పంపిణీ. బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో "టిడ్కో" ఇళ్ళు రాని వారికి కమిషనర్ పి రాజా బాబు తో కలిసి డి.డి.లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో నవరత్నాల పదకాలలో భాగంగా పేదలందరికీ ఇళ్ళు (టిడ్కో) అర్హులైన వారందరికీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దానిలో భాగంగా "టిడ్కో" ఇళ్ళ కొరకు 43,844 మంది లబ్దిదారులు దరఖాస్తు చేసుకోగా అందులో 13,842 మంది అనర్హులుగా గుర్తించబడ్డారని తెలిపారు. మొదటి దపాలో 13,842 మంది లబ్దిదారులకు ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారంగా వారు కట్టిన సొమ్మును ఈ రోజు నుండి తిరిగి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా 20 మందికి డి.డి. లు మేయర్ పంపిణీ చేసారు. అంతే కాకుండా ఇప్పటికే పూర్తైన ఇళ్ళలో 6,000 మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అన్ని సదుపాయాలతో పూర్తి అయిన ఇళ్ళకు రిజిస్ట్రేషన్లు చేసి బ్యాంకు లోన్ లు ఇప్పించటం జరిగిందని, అటువంటి గృహాలను లబ్దిదారులు స్వాదీనం చేసుకొని నివాసం వుండాలని తెలిపారు. ఎవరైతే అనర్హులుగా గుర్తించబడ్డారో వారందరికీ తిరిగి వారి సోమ్మును డి.డి.ల రూపంలో జోన్ల వారీగా జోనల్ ఆఫిసులలో జోనల్ కమిషనర్ ద్వారా ఇవ్వబడతాయి. అంతేకాకుండా అనర్హులందరికీ ఫోన్ల ద్వారాను, పెర్సనల్ గాను, మెస్సేజుల ద్వారాను ఏ ఏ జోన్లకు వెళ్లి తీసుకోవలెనో తెలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, వైఎస్ఆర్ సిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు, అదనపు కమిషనర్లు ఎస్ ఎస్ వర్మ, వై. శ్రీనివాస రావు, పి.డి.(యుసిడి) పాపునాయుడు, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పోస్టల్ ఎగ్జిబిషన్...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆంధ్రప్రదేశ్‌లోని ఫిలాటెలిస్ట్‌లు/ఫిలాటెలిక్ క్లబ్‌ల సహకారంతో ఎపెక్స్-2022 పేరుతో మూడు రోజుల రాష్ట్ర స్థాయి ఫిలాటెలిక్ ప్రదర్శనను నిర్వహిస్తోంది. నగరంలోని సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో బుధవారం ప్రారంభ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి ఈ రాష్ట్ర స్థాయి ఫిలాట్లీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ రాష్ట్ర స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ (ఎపెక్స్-2022)లో పోటీలు ఆంధ్రప్రదేశ్ నివాసితులందరికీ అందుబాటులో ఉంటాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల నుండి పాల్గొనేవారు తమ ఫిలాటెలిక్ సేకరణల ప్రదర్శనలను ప్రదర్శించడానికి "ఆహ్వానకుల తరగతి"లో కూడా పాల్గొనవచ్చు. ఎగ్జిబిషన్‌లో "యూత్ క్లాస్" వర్గం కింద విద్యార్థులు తమ ఫిలాట్లీ ప్రదర్శనలను కూడా ప్రదర్శించారు. ఈ ఎపెక్స్-2022లో ఫిలాటెలిస్ట్‌లు ప్రదర్శించిన 5700 కంటే ఎక్కువ ప్రదర్శనలు ఉన్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ అందాన్ని ప్రశంసించడంతో పాటు, ముఖ్య అతిథి విద్యార్థులు మరియు యువత పుస్తకాలకు మించి ఆలోచించి, జ్ఞానం మరియు జీవితం యొక్క ఆనందాన్ని అన్వేషించేలా ప్రేరేపించారు. అభిరుచులలో రారాజు అయిన స్టాంపుల సేకరణ యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు మరియు ఏపీ పోస్టల్ సర్కిల్ నిర్వహిస్తున్న ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ యొక్క అందాలను వీక్షించాలని మరియు భాగస్వామ్యం చేయాలని విద్యార్థులను కోరారు. విశాఖపట్నం నగరంలో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించినందుకు ఎ.పి. పోస్టల్ సర్కిల్‌కు ధన్యవాదాలు మరియు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలకు పోస్టల్ స్టాంపును విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలని తపాలా శాఖను కోరారు. డి.ఎస్.వి.ఆర్. మూర్తి, జ్యూరీ చైర్‌పర్సన్ ఎపెక్స్-2022 పోస్ట్‌మాస్టర్ జనరల్ విజయవాడ విశాఖపట్నం రీజియన్‌లు ఎపెక్స్-2022 గురించి పరిచయ గమనికను అందించారు. సభను ఉద్దేశించి పోస్ట్‌మాస్టర్ జనరల్ ప్రసంగిస్తూ, 8 సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ నిర్వహించే గొప్ప అవకాశాన్ని తెలియజేసారు. విద్యార్థులు, యువతను కోరారు. విశాఖపట్నంలోని పౌరులు ఎగ్జిబిషన్‌ని సందర్శించడానికి వివిధ ఇతివృత్తాలను అధ్యయనం చేయడంలో సహాయపడే వివిధ తపాలా స్టాంపులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో కె. రాజ కిరణ్ కుమార్, సీనియర్ మేనేజర్ అడ్మిన్, హెచ్‌పిసిఎల్ విశాఖపట్నం, ఆదిత్య కుమార్ నాయక్, ఎం జగదీష్ పాయ్, రోజ్ మేరీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపాడ్యమి వేడుకలు

విశాలాంధ్ర - రావికమతం: పవిత్ర కార్తీక మాసం ముగింపు కార్యక్రమం కొత్తకోటలో గురువారం తెల్లవారుజామున పోలీ స్వర్గానికి పంపే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీపారాధన చేసి ప్రవహించే నదిలో వదిలే సాంప్రదాయాన్ని కాపులుదిబ్బ, గుమ్ముడు సత్యదేవ్ వారి పొలానికి వెళ్లే దారిలో గల బూరిమను గట్టు వద్ద నిర్వహించారు. గ్రామంలో భక్తులందరూ తెల్లవారుజాము నుంచే ఆ ప్రాంతంలో ప్రవహించే నీటిలో దీపారాధన చేసుకోవడానికి వీలుగా భక్తులందరూ వినియోగించుకొనేందుకు సంబంధించిన ఏర్పాట్లను డిసిఎంఎస్ డైరెక్టర్, కొత్తకోట కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు గుమ్ముడు సత్యదేవ్, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు, గుమ్ముడు దొరబాబు, సీత గిరి, కొసిరెడ్డి శివాజీ, గుమ్మడి రమేష్, కొండచిన్నమనాయుడు, వేమవరపు రమణ, డాక్టర్ కొసిరెడ్డి సత్తిబాబు, భీమరాతి వెంకట్ పరిశీలించారు.

నందకోటలో ఎంపీపీ శెట్టి నీలవేణి పర్యటన

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని బీంపోలు పంచాయతీ నందకోట గ్రామంలో స్థానిక ఎంపీటీసీ శిరగంఅశోక్‌తో కలిసి పర్యటించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి పాఠశాల అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీటీసీ అశోక్తో కలిసి మండల ప్రాథమిక పాఠశాలను ముందుగా పరిశీలించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులు శివరామ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోండి : ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

విశాలాంధ్ర - గాజువాక సిటీ : గాజువాక పాత కన్నవానిపాలెం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణం రెడ్డి నరసింగరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఈ రోజు విడుదల అయిందని గతంలో నమోదు చేసుకున్న వారి పేర్లు జాబితాలో లేనియెడల ఈనెల 23 నుంచి డిసెంబర్ నెల 9వ తేదీ వరకు మరల నమోదు చేసుకునే అవకాశం ఉంది కాబట్టి గ్రాడ్యుయేట్ పూర్తయిన ప్రతి ఒక్కరూ వెంటనే ఆన్లైన్ ద్వారా లేదా స్థానిక తహసీల్దార్ కార్యాలయం జీవీఎంసీ ఆఫీస్‌లో తమ తమ డిగ్రీ సర్టిఫికెట్ ఫోటో ఆధార్ కార్డు సమర్పించి నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయనంద రెడ్డి, ఉపాధ్యక్షులు దేనంకొండ కృష్ణంరాజు, శశిధరన్ పిళ్ళై, ఎస్ఎఫ్ డివి మెంబర్ సిరసపల్లి నూకరాజు, డాక్టర్ శేషు ప్రసాద్, సుబ్రమణ్యం,మండల అధ్యక్షులు గూటూరు. శంకర్రావు, నాగేశ్వరరావు, జిలకర్ర. భువనేశ్వరి ,రమణ , అప్పలరాజు తాతారావు, పావని, పేర్ల.అప్పారావు, రాంబాబు, సత్తి బాబు శ్రీనివాస్ శ్రీరామమూర్తి, సత్యనారాయణ, ఫ్లీడర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాజువాకలో ఇప్పటి వరకు ఏర్పాటైన పదిహేడు పోలింగ్ బూతుల జాబితాను నియోజకవర్గ కోఆర్డినేటర్ కేఎస్ఆర్‌కి ఎంఎల్సి మాధవ్ అందజేశారు.

తామరం భవిత కేంద్రం మార్పు

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండలం తామరంలో ఉన్న భవిత కేంద్రాన్ని మండల కేంద్రంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలకు తరలించినట్లు మండల విద్యా శాఖాధికారి నగేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తామరం పాఠశాల గ్రామానికి లోపల ఉండటంతో దివ్యాంగులైన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఉద్దేశ్యంతో ఈ మార్పు చేసినట్లు ఆయన తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల ధృవపత్రాల పరిశీలన

విశాలాంధ్ర - కోటవురట్ల : దివ్యాంగుల సర్టిఫికెట్లు పరిశీలించిన ఎంపీడీవో మండ లంలో సామాజిక భద్రత పింఛన్ పొందుతున్న దివ్యాంగుల సర్టిఫికెట్లను పాముల వాకలో బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు సామాజిక భద్రత పింఛన్‌లో భాగంగా దివ్యాంగులు పొందుతున్న పింఛన్ యొక్క సర్టిఫికెట్లను, వ్యక్తులను పరిశీలించి ఒరిజినల్ సర్టిఫికెట్లుగా నిర్ధారణ చేస్తున్నారు. అనర్హులు డూప్లికేట్ సర్టిఫికెట్లు చేయించుకొని పింఛన్ పొందినట్లయితే అటువంటి వారి యొక్క పింఛన్‌ను తొలగిస్తామన్నారు. పాముల వాక సచివాలయంలో గ్రామానికి చెందిన పలువురు దివ్యాంగుల యొక్క సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది గ్రామాల్లో సామాజిక తనిఖీలు

విశాలాంధ్ర - మాకవరపాలెం : ఉపాధి పనుల నిర్వహణపై చేపట్టిన సామాజిక తనిఖీలు ఎనిమిది గ్రామాల్లో పూర్తయ్యాయని సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ సిహెచ్.రాజు తెలిపారు. మండలంలో 2019 ఏప్రిల్ నుంచి 2021 మార్చి వరకు ఉపాధి పథకం నిధులతో చేపట్టిన పనులపై ఈ నెల 15 నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. 25 పంచాయతీలకు గాను ఇప్పటి వరకు ఎనిమిది పంచాయతీల్లో తనిఖీలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఈ నెల 30వరకు తనిఖీలు కొనసాగుతాయన్నారు. డిసెంబరు 1న మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించి తనిఖీల్లో గుర్తించిన విషయాలను వెల్లడిస్తామన్నారు.

కిటకిటలాడిన బైరవాలయం

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి క్షేత్ర పాలకుడు బైరవస్వామివారి ఆలయం బుదవారం అమావాస్య సందర్భంగా భక్తులతో కిటకిట లాడింది. వేకువజాము నుంచి మధ్యహన్నాం వరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, ఒడిశా నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో భక్తులు సుమారు కిలోమీటరు వరకు క్యూలో బారులుతీరి కనిపించారు. బైరవ స్వామిని దర్శించుకున్న అధిక శాతం భక్తులు అమృతకలశాలను మొక్కు బడులుగా సమర్పించడంతో పాటు పంచామృతాభిషేకాలు జరిపించుకున్నారు. సర్వగ్రహ దోష నివారణార్థం ఆలయ పరిశరాల్లో నూనె దీపాలు వెలిగించారు. భక్తుల రద్దీని ముందుగానే ఊహించిన ఏఈవో శ్రీనివాసు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. సింహాద్రి అప్పన్న నిత్యాన్న దాన ప్రసాదంకు చప్ప కృష్ణప్రియ రూ.1,50,000/- లు, పోతుకుచి శ్రీదుర్గ కుటుంబ సభ్యులు 1,01116,/- రూపాయల డీడీ రూపంలో విరాళంగా ఏఈఓ నరసింహారాజుకు విరాళంగా అందజేశారు.

వినూత్న రీతిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలోని సొంట్యాం పంచాయితీ గొంతువానిపాలెం, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో, నీల కుండీలు వైయస్సార్ కాలనీ యువకులు వైయస్సార్ సిపి టీషర్టు ధరించి వినూత్న కార్యక్రమం చేపట్టారు. వైసీపీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు రౌతు శ్రీను ఆర్థిక సాయంతో సమకూర్చిన 100 టీషర్టులను యువకుల ధరించి వైయస్సార్సీపి అమలు చేసిన సంక్షేమ పథకాలను, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను కూడా లబ్ధిదారులందరికి చేరువయ్యే విధంగా గడపగడపకు వెళ్లి, ఆప్యాయంగా పలకరిస్తూ తెలియజేశారు. ఈ మేరకు శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రౌతు శ్రీను, యువకులను అభినందించి ప్రోత్సహించారు.

వైసీపీలో పలువురి చేరిక

విశాలాంధ్ర - మంచింగి పుట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకార్సితులైన పెదగూడ పంచాయతీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలకు గాను 98 మంది అరకు ఎమ్మెల్యే శెట్టి, పాల్గుణ, జిల్లా పరిషత్ చైర్పర్సన్ అరబీరు, సుబద్ర సమక్షంలో వైసిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం పంచాయతీ పరిధిలో గల గలగండ సారథి గ్రామంలో అరకు ఎమ్మెల్యే పాల్గుణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు ఆయా గ్రామాల ప్రజలతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆయన ఆరా తీశారు. గతంలో ఎన్నడు లేని విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఆయన అన్నారు, ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఆదుకునే విధంగా అనేక రకాల సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి అభివృద్ధి పథకాలు అందిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలకు ఎమ్మెల్యే మమేకమవుతున్నారు, అనంతరం పెదగుడా పంచాయతీ కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలకు చెందిన 98 మంది వైసిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న వారు మాజీ టిడిపి, సర్పంచ్, టి, నారాయణ, ఎంపీటీసీ గణపతి, ఉపసర్పంచ్ కవేర్ల హరిప్రసాద్,సిహెచ్ నగేష్ పడాల్ దుర్య నిర్మల మాజీ ఉపసర్పంచ్ మేడ కర్రీ బుద్ది, చెట్టీ సింహాచలం, చేట్టి అప్పన్న, పూజారి, హరికృష్ణ, వంతల, సుందర్ రావు, కె,అప్పారావు డి కర్రిబాబు టి.మాధవరవు కె గున్నాయా మఠం సిద్దేశ్వారా రావు వి సదానందం సువర్ణ గాలి నిలకంఠం, లక్ష్మణ్ త్రినాథ్తో పాటు, ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టు ఎస్ భాగ్యవతి, ఎంపిటిసి బి కమల, తి.రుపతిరావు, విత్ బాస్, సన్యాసిరావు అధిక సంఖ్య లో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానంలో పాలుపంచుకున్న సుందరపు

విశాలాంధ్ర - అచ్యుతాపురం : చోడపల్లి ఏర్పాటు చేసిన నిత్య అన్నదానంలో జనసేన యలమంచిలి నియోజక వర్గ సమన్వయకర్త సుందరపు విజయ్‌కుమార్ పాలుపంచుకున్నారు. చోడపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ చోడమాంబిక అమ్మవారి ఆలయం వద్ద కాకి నూకరాజు ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన కార్యక్రమంలో రోజుకు సుమారు 3 వందల వరకూ స్వాములు, భవానీలు భిక్ష చేస్తుంటారు. ఈ సందర్భంగా కాకి నూకరాజు మాట్లాడుతూ నవంబర్ 27న నాలుగు గ్రామాల ప్రజలకు బారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నాయకురాలు మోటూరు శ్రీవేణి, వడిశల నాయుడు, లీలా మోహన్‌రావు, గెద్దాడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే టీడీపీ ఆరోపణలు

విశాలాంధ్ర - జి.మాడుగుల : మండలం భీరం పంచాయితీ అనర్భ గ్రామంలో పర్యటించిన జి.మాడుగుల మండల వైసీపీ నాయకులు, సోమవారం జి.మాడుగుల మండల టీడీపీ నాయకులు ఏర్పాటు చేసుకొన్నా కార్యక్రన్ని కండిస్తూ గ్రామసభ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అనర్భ గ్రామస్తులు, మండల నాయకులు తీవ్రంగా కండిస్తున్నాము. వైసీపీ సూపరిపాలన చూసి టీడీపీ ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీలో భారీ చేరికలు జరుగుతావుంటే అది చూసి టీడీపీ నాయకులు వారి సింపతీ కోసం టీడీపీ నాయకులకు,కార్యకర్తలకు కండువాలు వేసుకుంటున్నారు. ఈ రోజు మా ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతావుంటే అది చూసి ఓర్వలేక ఈ రోజు టీడీపీ నాయకులు మా మీద బురదజల్లే కార్యక్రమా చెయ్యడం విడ్డురంగా ఉంది. మీ టీడీపీ నాయకులు, మీ టీడీపీ పార్టీ ఏం చేస్తుందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో వైసీపీ 175 స్థానాలు గెలుస్తుంది, అన్న భయంతో ఈరోజు టీడీపీ నాయకులు చిల్లరి రాజకీయాలు చేస్తున్నారు. మీ టీడీపీ అదినాయకుడు ముసలికన్నీరు పెట్టుకొని ఇదే నా చివరి ఎన్నిక అని ఏ మొఖం పెట్టుకొని అడుగుతున్నాడో మీకు అర్థం కావటం లేదా! మీకు మీ టీడీపీకి చివరి ఎన్నిక 2019 కే అయిపొయింది. ఇప్పుడు మీరు ఎన్నికలు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. మీకు దమ్ముంటే మీరు పరిపాలించిన 14 సంవత్సరాలు మీరు ఏం చేసారో ప్రజలకు చెప్పండి. కానీ మీకు ప్రజలకు చెప్పే నైతిక హక్కు లేదు.ఎందుకంటే మీరు ప్రజలు దగ్గర వెళ్ళలేరు కనుక! ఈరోజు మా వైసీపీ ప్రభుత్వం మా జన వృదయ నేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు పరిపాలనలో అన్ని ప్రాంతాలలు కులానికి మతానికి ప్రాంతానికి వర్గానికి పార్టీ లకు అతీతంగా సమాన పరిపాలన చేస్తుంటే మీకు మీ ప్రభుత్వనికి మీ నాయకులకు కనిపించలేదా!మీ చిల్లర రాజకీయం మీ నీచమైన రాజకీయం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.రేపు జరగబోయేటటువంటి 2024 ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాలు గెలుస్తాం! మా జగనన్నకు సీఎం చేస్తాం! మా భాగ్యమ్మకు ఎమ్మెల్యే చేస్తాం ఇది మాత్రం తథ్యం జై జగన్ జై భాగ్యమ్మ ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కే సత్యనారాయణ గారు సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు ఎస్.రామకృష్ణ జి.మాడుగుల సర్పంచ్ కే రాంబాబు గారు గెమ్మెలి సర్పంచ్ ఎస్.కొండబాబు గారు లువ్వాసింగి ఎంపీటీసీ జి సన్యాసి దొర గారు కె కొదపల్లి సర్పంచ్ ఏం వెంకటరమణ గారు యువజన అధ్యక్షులు ఎల్ కళ్యాణం గారు వైసీపీ నాయకులు అంద్రయ్య ప్రశాంత్ ప్రకాష్‌నాయుడు సోషల్ మీడియా లక్ష్మణ్ బాలన్న శ్రీను నారాయణ గోపాల్ వరలక్ష్మి వందు నాయుడు అనర్భ గ్రామం వైసీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కృష్ణ మూర్తి సీనియర్ నాయకులు రాంబాబు గ్రామ పెద్దలు కర్రన్న వార్డు సభ్యురాలు వింజమ్మ లక్ష్మి పోతురాజు గ్రామస్తులు యువకులు మహిళా మణులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలంటే అరకులోయ, అనంతగిరి మండలాలే గుర్తుకురావడం శోచనీయం

విశాలాంధ్ర - సీలేరు : పర్యాటక ప్రాంతాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న అధికారులకు కేవలం అరకువేలీ, అనంతగిరి మండలాలే గుర్తుకు రావడం శోచనీయమని భారతీయ ఆదివాసుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గడుతూరి రాంగోపాల్, సభ్యులు పరధాని గంగరాజు, మర్రి కామరాజు, బద్నాయిని విశ్వేశ్వరరావు, జర్రా దిలీప్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రైవేటు కాలేజీలు, రిసార్ట్స్, హోటళ్లు పుష్కలంగా ఉన్న అరకు వేలీ, అనంతగిరి మండలాలలోనే ఎకో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేయడానికి అటవీశాఖ అధికారులు ప్రయత్నం చేయడం చూస్తుంటే అధికారులకు ఈ ప్రాంతంపై ఉన్న మోజు, ప్రేమ కనబడుతోందన్నారు. చింతపల్లి (లంబసింగి, వంగపార దగ్గర), గూడెంకొత్తవీధి (ఆర్‌వి నగర్ దగ్గర)లలో కాఫీ తోటలు ఎక్కువ విస్తీర్ణంలో ఉండి ఎకో టూరిజంలు చేపట్టడానికి ఎంతో అనుకూలంగా ఉంటాయని వారు తెలిపారు. సప్పర్ల దగ్గర రైన్‌గేజ్, శ్రీదారాలమ్మ అమ్మవారి దేవాలయం దగ్గర జలపాతాలు వంటి సుందర ప్రదేశాలలో ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపట్టవచ్చన్నారు. ఇక్కడ దేవాదాయ శాఖ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు చేపట్టవచ్చునని, వీటిని విస్మరించి కేవలం తమకు గల వ్యక్తిగత ఆశక్తులతో ఒక ప్రాంతానికే ప్రాధాన్యత ఇచ్చి మిగతా ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అనంతగిరి మండలంలో గల కాఫీ తోటలలో ఎకో టూరిజం ప్రాజెక్టు చేపట్టడంతో పాటుగా చింతపల్లి మండలంలో లంబసింగి, వంగపార, గూడెం కొత్తవీధి మండలంలో ఆర్‌వి.నగర్ కాఫీ తోటల వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనేక సుందర ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశం కలిగి ఉన్నాయన్నారు. ముంచింగ్‌పుట్ మండలం పెదబయలు మండలాలను అనుకొని మత్స్య గడ్డ పరివాహక ప్రాంతంలో పూలతోటలు అభివృద్ధి చేసి ఎకో టూరిజం కాటేజీలు నిర్మించి మత్స్యగడ్డలో బోటింగ్ సదుపాయం కల్పించి విద్యాటకులను ఆకర్షించవచ్చన్నారు. పెదబయలులో ఎంద్రిక పర్వతం వద్ద ట్రెక్కింగ్ సదుపాయం కల్పించవచ్చని, అలాగే సమీపంలో దారాలు జలపాతం, జామిగూడ జలపాతం అభివృద్ధి చేయవచ్చు. హుకుంపేటలో సీతకొండ వద్ద ట్రెక్కింగ్ చేయడానికి సదుపాయం కల్పించవచని, అండిబలో టెంపుల్ టూరకు ప్రాజెక్టు చేపట్టవచ్చని, దుంబ్రిగుడ దగ్గర అడవి వలస గుహలు పర్యాటకంగా అభివృద్ధి, గంగరాజు మాడుగుల మండలంలో అక్కా చెళ్ళళ్ళ జలపాతం, గుహలు అభివృద్ధి, చింతపల్లి మండలంలో ఎర్రవరం జలపాతం, రహదారి నిర్మాణం చేపట్టి పర్యాటకులను ఆకర్షించవచ్చునని చెప్పారు. మనకంటే చిన్న రాష్ట్రాలైన కేరళ, గోవా, ఈశాన్య రాష్ట్రాలు పర్యాటక రంగంలో ఎంతో ముందడుగు వేసాయని, చిన్న చిన్న ప్రదేశాలను కూడా పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్ది పర్యాటకులను దేశవ్యాప్తంగా ఆకర్షిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి పదంలో నడుస్తున్నాయని చెప్పారు. ఆ దిశగా అల్లూరి సీతారామరాజు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన బెహరా

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92వ వార్డు 460 సచివాలయం పరిధిలో గల వెంకటాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 20 లక్షల రూపాయలతో రోడ్లు డ్రైనేజీ లు మరియు కల్వర్టుల పనులను బుధవారం జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పరిశీలించారు. వెంకటాపురం వెంకటాద్రి గార్డెన్స్ నుండి రెడ్డి వీధిలోకి వెళ్లే కల్వర్టు, వెంకటాపురం నుండి బలిజి వీధిలోకి వెళ్లే కల్వర్టు, ఎంపీపీ స్కూల్ దగ్గరికి కల్వర్టు, కృష్ణుడి గుడి వెనుక రోడ్డు డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లోపాలు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గొంతిన నాగరాజు, నీలాపు లోకేష్ రెడ్డి, గొంతిన జగదీష్, అభిరామ్, బాలు, మనోహర్, బలిజి మణికంత, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన రహదారికిరువైపులా ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - యలమంచిలి : యలమంచిలి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, సైతార్ పేట రోడ్డు వద్ద గల ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఎంక్రోచ్ మెంట్ లను బుధవారం నాడు మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది జేసిబితో తొలగించారు. ప్రధాన రహదారి పక్కన వాహనాలు కూడా నిలిపేందుకు వీలు లేకుండా ఆక్రమించి దుకాణాల ముందు వేసిన షెడ్డులను తొలగించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈ ఆక్రమణల తొలగింపు వలన వాహనాలు నిలుపుకునేందుకు, అలాగే రహదారి పక్కన ఉన్న డ్రైనేజీల వ్యవస్థను సక్రమంగా ఉంచుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అలా కాకుండా రోడ్డుపై వాహనాలు నిలుపుతూ ఉండడం వలన రవాణా సమస్య పెరిగిపోతోందని అన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భవన యజమానులు దుకాణదారులు సహకరించి మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, దుకాణదారులన్నారు.

జనసేన పార్టీపై సీఎం జగన్ వ్యాఖ్యలు అర్ధరహితం

విశాలాంధ్ర - నర్సీపట్నం : మత్స్యకార దినోత్సవ సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనసేన పార్టీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నర్సాపురం సభలో ముఖ్యమంత్రి జగన్ తన ప్రసంగంలో జనసేన పార్టీని రౌడీ పార్టీగా అభివర్ణించడం సరికాదన్నారు. రౌడీలు, గుండాలు, హత్యలు చేసేవారు, 420లు వైసిపి పార్టీలోనే ఉన్నారని, అటువంటి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జనసేన పార్టీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. జనసేన పార్టీ సేవాభావం గల పార్టీ అని రోడ్లు విషయం, ఉద్దానం, విశాఖలో చేస్తున్న దోపిడిలు తదితర విషయాలను బయటపెడుతున్నామని, జగనన్న కాలనీలు, పేదలందరికీ ఇళ్లు పేరుతో దోచుకున్న విషయం బయటపెట్టిన పార్టీ తమదేనన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలపై పోరాడుతున్నామన్నారు. జనసేన పార్టీలో మోసాలు చేసేవారు, బూతులు తిట్టేవారు ఎవరు లేరన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించి ప్రజాహిత పరిపాలన సాగించాలన్నారు. అభద్రతభావంతో ప్రతిపక్ష పార్టీలపై బురదజల్లుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. జనసేన పార్టీని దుర్భాషలాడితే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైతులందరూ ఈ క్రాఫ్ చేయించుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట : మండల కేంద్ర పరిధిలో గల సూకూరు గ్రామపంచాయతీ రైతుభరోసా కేంద్రంలో రైతులకు ఈ క్రాఫ్ సర్టిఫికెట్ స్థానిక సర్పంచ్ ధనసాని సత్యవతి బుధ వారం అందజేశారు, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతు ఈ క్రాఫ్ సర్టిఫికెట్ చేసుకున్న ప్రతి రైతుకు సబ్సిడీ విత్తనాలు, పంట రుణాలు, పంటనష్టం, ప్రభుత్వం చేపట్టబోయే పథకాలు హర్వులు కావున ఈ అవకాశన్ని ప్రతీరైతు ఉపయోగించుకోవాలని, ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి స్థానిక నాయకులు మురళి, చిన్నేశ్వర్‌రావు, సచివాలయ సిబ్బంది హార్టికల్చర్ అసిస్టెంట్ కృష్ణ, వాలెంటీర్స్, రైతులు పాల్గొన్నారు.

మరిడిమాంబ వర్తక సంఘం ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర - పరవాడ : లంకెలపాలెం కూడలిలో రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు పడి ప్రమాదాలు జరుగు తున్నాయి. ప్రతిరోజు వేలాది భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్లు ధ్వంసం అయ్యాయి. దీంతో తరచూ అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక వర్తకులు ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన ఆయన 79వ వార్డులోనే తారు ప్లాంట్ యాజమాన్యానికి ఫోన్ చేసి తారు, పిక్క మిక్సింగ్‌ను ఇవ్వవలసిందిగా కోరారు. దీంతో వర్తక సంఘం సభ్యులు లారీతో ఆ తారు మిక్సింగ్‌ను తీసుకొచ్చి లంకెలపాలెం నుండి పరవాడ వెళ్లే రోడ్డులో బ్రిడ్జి వద్ద మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా వర్తక సంఘం తరపున రౌతు శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం మాజీ అధ్యక్షులు బొండా నారాయణరావు, ఉపాధ్యక్షులు తురుశాల నర్సింగరావు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చౌదువాడ నరసింగరావు, ఉడతా నానాజీ, బి.నాని, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు



విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు,సమస్యల 504 సచివాలయం పరిధిలోని గొల్లవిల్లివాని పాలెం, ఎల్ఐసి లే అవుట్ లలో బుధవారం సాయంత్రం గడప, గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలు అందుతున్న వైనం గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలు పరిష్కారించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ప్రజలనుండి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు యూత్ ప్రెసిడెంట్ చిప్పల చందు, పార్టీ నాయకులు వెంకటపతిరాజు, ఆకుల వాసు, నాగేంద్ర కుమార్, రాపర్తి సూరిబాబు,వెంకటేష్,స్కేటింగ్ మురళి, గొల్లవిల్లి మంగరాజు, జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది, ఆర్పీలు, వాలంటీర్లు పాల్గొన్నారు,

ఘనంగా సత్యసాయిబాబా 97వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర- పెందుర్తి : భగవాన్ సత్యసాయి సేవలు అజరామరంగా నిలిచిపోతాయని ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. జీవీఎంసీ 97 వ వార్డు, సుజాతనగర్ సత్యసాయి భజన మండలి(ఆనంద నిలయం) ఆధ్వర్యంలో బుధవారం సత్య సాయి బాబా 97వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సత్య సాయికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు నిర్వహించారు. 108 రకాల పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించారు.. బాల వికాస్ ఫౌండేషన్ పిల్లలు చక్కని సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ సత్యసాయి బాబా ప్రపంచానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. బాబా సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, సుజాత నగర్ భజన మండలి గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఇక్కడ సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించడం ఇందులో తామంతా పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరిలోనూ భగవంతుని చూడగలిగేదే సత్య సాయి మార్గం అన్నారు. ఈ సందర్భంగా పలువురు నిరుపేదలకు కుట్టు మిషన్లు, అమృత కలశలు, దుప్పట్లు గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు. అయా కార్య క్రమంలో చీడికాడ జడ్పిటిసి సభ్యురాలు శారద, భజన మండలి నిర్వాహక సభ్యులు బుజ్జిబాబు, జ్యోతి, ముక్క గోపి ,శ్రీను మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : పట్టణంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 97వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని సత్యసాయిబాబా సేవా సమితి కన్వీనర్ తెలిపారు. బుధవారం ఉదయం గం.5లకు సుప్రభాతం అనంతరం

పట్టణంలోని పురవీధుల్లో నగర సంకీర్తనతో బయలుదేరి గం.8:30లకు సాయిబాబా వేదమంత్రాలతో పతాకావిష్కరణ చేసి భజన మందిరం వద్ద వ్రతములు చేశారు. అనంతరం మహా నారాయణ సేవ, సాయంత్రం ఐదు గంటలకు భజన, ఝులా ఉత్సవం నిర్వహించారు. సత్యసాయి బాబా పల్లకి సేవ ఊరేగింపుగా భజన కీర్తనలు ఆలపిస్తూ పట్టణంలోని పురవీధుల్లో బాబా వారి చిత్రపటాన్ని ఉరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

89వ వార్డులో రూ.20 లక్షల పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 89వ వార్డ్‌లో విశాఖ పశ్చిమ నియోజక వర్గం సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కులం చూడం, మతం చూడం, పార్టీలు చూడం అర్హత మాత్రమే ప్రామా ణికం. అదే రాజన్న రాజ్యం అన్నారు. వార్డు నందు వార్డ్ ఇంచార్జ్ దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో అప్పల నరసింహ కాలనీ సచివాలయం నెంబర్ :1086464 పరిధిలో గడప గడపకి మన ప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా గతంలో గడపగడపకి మన ప్రభుత్వం కార్య క్రమంలో మంజూరు చేయ బడిన నాలుగు వర్కులకు మొత్తం 20 లక్షలు నిధులతో కూడిన రోడ్లు డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 400 గడప లను సందర్శించి వారికి అందు తున్న ప్రభుత్వ పథకాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటికి పరిష్కారాల కోసం సంబ ంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. పిదవ పశ్చిమ నియోజక వర్గంలో గల రైల్వే సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు వినత పత్రం అందజేసి 89 వార్డు నందు కొత్తపాలెం వద్ద గల అండర్ బ్రిడ్జిని వెడల్పు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడటం, ఎల్లపు వాని పాలెం ఊరు అనుకొని ఉన్న వ్యవసాయ భూములకు ఎలక్ట్రికల్ లైన్ ఏర్పాటు చేయుట కొరకు అనుమతి, 90 వార్డు నందు గవర వీధి నందు గల డ్రైనేజీకి రిటైనింగ్ వాల్ మరియు నిర్వ హణకు అను మతులు, 91, 92 వార్డు నందు భాజి జంక్షన్ ఎస్సీ కాలని దిగువ నుండి స్మశానం వరకు రోడ్డు నిర్మాణం కు అనుమతి, వెంకటాపురం నందు గల ఐదు మతాల నుండి భారీ వాహనాలు మరియు రవాణా వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టడం చర్యలు గురించి చర్చించి నేతలు ఆడారి తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు స్థానిక నాయకులు సచి వాలయ సిబ్బంది, ఆర్పీలు, వాలం టీర్లు, యువత, మహిళలు నాయ కులు పాల్గొన్నారు.